నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 22 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లో నిల్చొన్న భక్తులు

వైభవోపేతం..సత్యదేవుడి కల్యాణం

● గోవింద నామస్మరణతో మార్మోగిన గూడెం గుట్ట
● వేలాదిగా హాజరైన భక్తులు ● పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, ఫిబ్రవరి 21: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం గుట్టపై బుధవారం రాత్రి శ్రీసత్యదేవుడి కల్యాణం కమనీయంగా జరిగింది. సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గోధూళిక సుముహూర్తమున శ్రీసత్యనారాయణస్వామి-రమాదేవి కల్యాణాన్ని వేదపండితులు ఆశేష భక్తజనం మధ్య ఘనంగా జరిపించారు. ముందుగా గుట్ట కింది భాగం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రధాన అర్చక బృందం సన్నాయి వాయిద్యాలతో ప్రధాన ఆలయం వరకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. టీడీడీ నుంచి వచ్చిన పట్టు వస్త్రాలను స్వామి వారికి ఈవో, అర్చకులు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కల్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పుష్పాభిషేకం చేసిన అనంతరం కల్యాణ వేదిక వరకు స్వామివారి విగ్రహమూర్తులను తీసుకెళ్లారు. అనంతరం కల్యాణ మహోత్సవం జరిపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన రఘుస్వామి, అర్చకులు సంపత్‌స్వామి, గోపాల స్వామి, సురేశ్ స్వామి, వేదపండితులు నారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

ఉన్నత లక్ష్యంతో చదవాలి

జిల్లా నోడల్ అధికారి శంకర్

కెరమెరి, ఫిబ్రవరి 21: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని జిల్లా నోడల్ అధికారి శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలకు బుధవారం ఆయన హాజరయ్యారు. వేడుకల జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. క్రమశిక్షణతో, శ్రద్ధగా చదివి ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జాతిపిత గాంధీ, అంబేద్కర్, స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ పరశురాములు మాట్లాడుతూ చదువుల్లో రాణించినప్పుడే భవిష్యత్ బాగుంటుందన్నారు. కార్యక్రమంలో జైనూర్, ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణి, దహెగాం కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీదేవి, రాందాస్, సంపత్, లక్ష్మణ్, అమరేందర్, ఆసిఫాబాద్ మోడల్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కనకయ్య, లెక్చరర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్, చంద్రయ్య, సునీల్‌తో పాటు కెరమెరి కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి శంకర్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

-మంచిర్యాల డీఈవో యాదయ్య

నస్పూర్, ఫిబ్రవరి 21: మంచిర్యాల జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో యాదయ్య సూచించారు. మంచిర్యాలలోని డీఈవో కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు, రూట్ అధికారులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు జరుగుతాయని, ఇందుకోసం జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే ఎంఈవోల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయపరీక్షల అధికారి దామోదర్‌రావు, ఎంఈవోలు, సీఎస్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఫిబ్రవరి 21: జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. నస్పూర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి రాష్ట్ర స్థాయి సీఎం ప్రజావాణిలో అందిన దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ధరణి పోర్టల్‌లో నమోదైన భూ సంబంధిత విషయాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని సూచించారు. హైకోర్టు, లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచే చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

పోలీసుల బందోబస్తు మధ్య సారక్కను గద్దెకు తీసుకొస్తున్న కోయ పూజారి కృష్ణదోర, భక్తులు
సారక్కకు మొక్కుతున్న భక్తురాలు
అమ్మవారిని గద్దెకు చేరుస్తున్న కోయ పూజారి కృష్ణదోర

సల్లంగ సూడు.. సారలమ్మ

● వైభవంగా వనదేవతల జాతర ప్రారంభం ● గోదారి తీరమంతా భక్తుల సందడి
● నేడు గద్దె పైకి సమ్మక్క తల్లి ● పోలీసుల పటిష్ట బందోబస్తు

జాతరకు తరలి వస్తున్న భక్తులు

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 20: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలో వనదేవతల జాతర వైభవంగా ప్రారంభమైంది. బుధవారం ఉదయం 4 గంటలకు సంప్రదాయరీతిలో గద్దెల వద్ద కోయ పూజారులు ప్రత్యేక పూజలు ప్రారంభించారు. మేడారానికి చెందిన గిరిజన పూజారి కృష్ణ దొర బృందం ఆధ్వర్యంలో సారలమ్మను డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో, పోలీసుల పహారా నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి గద్దెలపై కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇల్లారి (గుడి) నుంచి పడిగిద్దరాజు, గోవిందరాజులను, గద్దెలపైకి తీసుకవచ్చి ప్రతిష్ఠించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి సారలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గద్దెలపైకి సమ్మక్క..

వనదేవతల జాతరలో భాగంగా గిరిజనుల ఇలవేల్పు సమ్మక్క తల్లి గద్దెల వద్దకు నేడు చేరుకోనుంది. ఇందు కోసం జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంచిర్యాల, కుమ్రం భీం జిల్లాలతో పాటు, మహారాష్ట్ర నుంచి అమ్మవార్లకు మొక్కులను తీర్చుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో భక్తులకు పూర్తి ఏర్పాట్లు చేశారు. భక్తులు పుణ్య స్నానాలను ఆచరించడానికి ప్రత్యేకంగా నల్లాలు, గదులను ఏర్పాటు చేశారు. పారిశుధ్య చర్యలను చేపట్టారు. రామగుండం సీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంచిర్యాల డీసీపీ రాంనాథ్ కేకేన్ సూచనలతో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీ ఆరె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పూర్తి చర్యలు తీసుకున్నారు.

ఆసిఫాబాద్ జిల్లాలో..

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు ఒడ్డున వెలిసిన సమ్మక్కకు ఎమ్మెల్యే కోవలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్లకు బంగారం(బెల్లం)తో పాటు సారెను సమర్పించారు. మూడు రోజులపాటు జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

మొక్కులు చెల్లించుకుంటున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

దర్శించుకున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాలు సురేఖ

జీతాలూ మహాప్రభో..

● కొత్త ప్రభుత్వంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అందని వేతనాలు
● రెండు నెలలుగా ఎదురుచూపు.. కుటుంబాల పోషణకు కష్టాలు
● ఇచ్చిన హామీని నిలుపు కోవాలంటున్న అంగన్‌వాడీలు

కరీంనగర్, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'ఓడెక్కె దాకా ఓడ మల్లన్న.. ఓడ దిగినంక బోడి మల్లన్న' అన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. శాసనసభా ఎన్నికలకు ముందు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన ఆ పార్టీ, ఇప్పుడు అమలులో మాత్రం చోద్యం చూస్తున్నది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచడంతోపాటు ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏ నెలకు ఆనెల నిధులు విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చినా.. తీరా గెలిచిన తర్వాత జీతాలు పెంచడం దేవుడెరుగు? ఉన్న జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది.

నాడు ఆదుకున్న కేసీఆర్ సర్కారు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, ఆరేళ్లలోపు బాలలకు ఆటాపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నారు అంగన్‌వాడీలు. అలాగే, ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. అయినా నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. వేతనాలు పెంచాలని అనేక ఆందోళనలు చేసినపుడల్లా కంటితుడుపుగా రూ.100 నుంచి రూ.200లు పెంచేవారు. అవి ఏ మూలకూ సరిపోక ఇబ్బంది పడేవారు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఆ పరిస్థితి మారింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే కీలకమైన సేవల్లో ఉన్న అంగన్‌వాడీలకు సముచిత స్థానం కల్పించింది. కేంద్రంతో నిమిత్తం లేకుండా ఈ చిరుద్యోగుల సంక్షేమాన్ని చూసుకున్నది. తెలంగాణ వచ్చినప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.3,200, హెల్పర్లకు ఇంకా తక్కువ వేతనం ఉండగా, రాష్ట్రం వచ్చిన వెంటనే వీరికి వేతనాలు పెంచింది. టీచర్లకు నెలకు రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 వేతనం అందించింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా వేతనాలు పెంచలేదు. ఆ తర్వాత ప్రభుత్వోద్యోగులకు ఇస్తున్నట్టుగా రెండు సార్లు పీఆర్‌సీ అమలు చేసింది. అయితే కరోనా విపత్కర కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా.. సంక్షేమాన్ని మాత్రం ఆపలేదు. ఉద్యోగులకు అటో ఇటో వేతనాలు కాస్త ఆలస్యమయ్యాయి. కానీ, ఏ నెల కూడా వేతనాలు ఆపలేదు.

నేడు జీతాల కోసం నిరీక్షణ

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలిచ్చింది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏనెలకు ఆ నెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చింది. ఇంకా ఒకటో తారీఖే వేస్తామని చెప్పింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 75 రోజులు గడిచింది. కానీ, ఇప్పటికీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు విడుదల చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 35వేల సెంటర్లలో పనిచేస్తున్న దాదాపు 65 వేల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. జీతాలు పెంచడమేమో గానీ, ఉన్న జీతాలు కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏరు దాటినంక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుతం తమ పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. జీతాలు లేక తమ కుటుంబాల పరిస్థితి కడు దయనీయంగా మారతున్నదని, అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ నాయకుల ఎదుట గోడు వెళ్లబోసుకుందామంటే, కనీసం వారిని కలిసే సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమకు సత్వరమే జీతాలు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

149 మందికి 'ఇన్‌స్పైర్' అవార్డులు

జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 21: ఇన్‌స్పైర్ మనక్ పథక అవార్డులు 2023-24కు జిల్లా వ్యాప్తంగా 149 మంది విద్యార్థులకు మంజూరైనట్లు డీఈవో ఎస్ యాదయ్య తెలిపారు. దీంతో పాటు ఆదిలాబాద్ జిల్లా నుంచి 66, కుమ్రం భీం ఆసిఫాబాద్ నుంచి 108, నిర్మల్ జిల్లా నుంచి 125 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల జిల్లాకు ఎక్కువ మొత్తంలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు రావడం తమకెంతో గర్వకారణమని ఆయన తెలిపారు.

ప్రాజెక్టుల తయారీకి రూ. 10వేలు

విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏటా దేశంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ అవార్డులను అందిస్తున్నాయని డీఈవో యాదయ్య తెలిపారు. ఈ పథకానికి ఎంపికైన విద్యార్థులకు రూ. 10వేలు ఆర్థిక సాయాన్ని అందజేస్తారని, ఈ మొత్తం నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకి జమ అవుతాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వారు రూపొందించిన ప్రాజెక్టులతో 2024- 25 విద్యాసంవత్సరం జూన్‌లో నిర్వహించే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా 60 ప్రాజెక్టులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల హెచ్ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు మరిన్ని వివరాలకోసం జిల్లా సైన్స్ అధికారి మధుబాబును 9849550200 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేనే ఎమ్మెల్యే.. నన్నెవరూ ఏం చేయలేరు..

● మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బెదిరింపులు
● ప్రభుత్వ స్థలం ఆక్రమించి ప్లాట్లుగా విక్రయాలు
● సోమగూడెం(బీ) మాజీ సర్పంచ్ ప్రమీలాగౌడ్ ఆవేదన

మాట్లాడుతున్న సోమగూడెం సర్పంచ్ కొరకొప్పుల ప్రమీలాగౌడ్, ఎంపీటీసీ చుంచు మల్లమ్మ

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21 : బెల్లంపల్లి ఎమ్మెల్యేను నేనే.. భూ కబ్జాలు చేసినా ఏ అధికారీ నన్ను అడ్డుకోలేరని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్ బెదిరిస్తున్నట్లు సోమగూడెం (బీ) సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలా గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బెల్లంపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీటీసీ చుంచు మల్లమ్మతో కలిసి ఆమె మాట్లాడారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారు సోమగూడెం జాతీయ రహదారిని ఆనుకొని ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా చేసి తన అనుచరుడు ముత్తె భూమయ్యతో కలిసి విక్రయిస్తున్నాడని ఆరోపించారు. గ్రామ పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు లేవని, ఆ స్థలం అమ్మవద్దు, కొనవద్దని రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు సైతం తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు పంచాయతీ కార్యదర్శిపై కూడా బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. గతంలో ఈ స్థలాన్ని శ్మశాన వాటిక, డంప్ యార్డుకు ప్రభుత్వం కేటాయించగా, అక్కడి ప్రజల వ్యతిరేకత మేరకు మరో చోట ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు ఆ స్థలాన్ని రాంచందర్ తన అనుచరులతో కలిసి కబ్జా చేసి, ప్లాట్లుగా మారుస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా, చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ అండదండలతోనే భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే స్పందించి భూకబ్జాలకు అడ్డుకట్ట వేయడానికి సంబంధిత అధికారులను ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఆక్రమిత భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఇల్లు లేని పేదలకు కేటాయించాలని కోరారు. నాయకులు చుంచు లింగయ్య, చుంచు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో అధికారుల తనిఖీలు

వేంపల్లి రైస్ మిల్లులో సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సిర్పూర్ (టీ), ఫిబ్రవరి 21: మండలంలోని వేంపల్లి రైస్ మిల్లులో బుధవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ రైస్‌మిల్లులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మిల్లుకు ప్రభుత్వం మిల్లింగ్‌కు 38,265 బ్యాగులు కేటాయించగా 2174 బ్యాగులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 36,091 బ్యాగులు మాయమైనట్లు తెలిపారు. ఈ మేరకు 6ఏ కేసు నమోదైనట్లు ఆయన తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ముబీన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్,ఫిబ్రవరి 21: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి బుధవారం పరిశీలించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూంలను జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలుర గురుకులంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులతో సమీక్ష

జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలకు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అని బృందాలు సమన్వయంతో పని చేసి, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం పీటీజీ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్